## 360 క్రైస్తవ లక్షణము

రా - శంకరాభరణము తా-త్రిపుట

యేసు క్రీస్తు మతస్థుఁ డనఁగా - నెఱిఁగి మనుఁడీ జగము లోపల = వాసిగాఁ ప్రభు యేసు దాసులె - పరమునందు ని-వాసులగుదురు ॥యేసు॥

1. యేసు క్రీస్తును నమ్మి యాయన - దాసుఁడై వర్తించు నాతఁడె = భాసురంబుగఁ గ్రైస్తవుం డని - ప్రాకటంబుగఁ బరగుచుండును ॥యేసు॥
2. ఎల్ల సమయములందు ధాత్రిని - యేసు నడతలఁ జూచి నడఁచుచు = నుల్లమున రక్షకునిఁ దాల్చిన - యోర్పరియె క్రైస్తవుఁడు సుమ్ము ॥యేసు॥
3. క్రీస్తు నన్ను గొనెను గావున - క్రీస్తువాఁడను నేన టంచును = క్రైస్తవుండు గొల్చు నాతని - వాస్తవమ్ముగ నాత్మ తనువుల ॥యేసు॥
4. రాజులు యాజకులు శుద్ధులు - రాజనందను లనెడు పేళ్ళను = రాజ రాజగు దేవుఁ డొసఁగెను - రాజితంబుఁ క్రైస్తవులకును ॥యేసు॥
5. క్షయము లేనిది శుద్ధమైనది - వ్యయము లేనిది నిత్యమైనది = దయను యేసుఁ డొసంగు భాగ్యముఁ - దప్పకుండఁ క్రైస్తవులకును ॥యేసు॥

- మేడికాయల సాధువు

## 361 యేసునకు సాక్షులు

రా - ఆనందభైరవి తా-ఆది

యేసుప్రభుకై - సాక్షులెవరెవరో -ఎవ్వరెవ్వరో యని - యాశతో ప్రభు - వడుగుచున్నాడు = యేసు కొరకై - నిల్చి క్రైస్తవ - యువకులెల్లరు సాక్ష్యమిచ్చుచు - భాసురంబుగ - క్రీస్తు - నెంతో భారతీయులు ప్రస్తుతించరో ॥యేసు॥

1. దేవదర్శన మొంది లేలెండి - ధనజనులకెల్లను - దైవ ప్రేమను గూర్చి దెలుపండీ = పావనుండగు ప్రభుని బోధలు - పాడి రక్షణ మార్గమెల్లను సావధానముతోడ దెల్పరే - సౌలు మారి పౌలెటాయెనో ॥యేసు॥
2. రాయబారుల - మంచు నమ్మండి - రారాజు వార్తలు - రేయిబవలును దెలుప లేలెండీ = పాయకుండగ - యేసు తన విమ - లాత్మ నెప్పుడు తోడ నుంచును - పాపులెల్లరు - యేసు ప్రభుని - పాదములు సేవించి బ్రతుకగ ॥యేసు॥
3. ధీరులై శుభవార్త జాటండీ - దినదినము వాక్య ప్ర - చారమెల్లను చేయ లేలెండీ = చేయవలసిన దెల్ల ప్రభువే - చేయు మీతో - నాత్మరూపున - జయము మీదను - జయమునిచ్చి - జగతిని దగ వెలుగ జేయగ ॥యేసు॥
4. పౌలు మాదిరి బోలి లేలెండీ - పరలోక రాజ్య - ప్రచారమెల్లను జేయలేలెండీ = పలువిధంబుల శ్రమలకోర్చి - ప్రభువు శత్రుల నెల్ల మాడ్చి - సిలువ ధ్వజమును చేతబట్టి - సుస్థిరంబగు సేవ జేయగ ॥యేసు॥

- చెట్టి భానుమూర్తి



## 362 *Onward Christian Soldiers*

1. క్రీస్తు యోధులారా
యుద్ధ మాడుఁడీ
క్రీస్తు సిల్వ మీరు
పట్టి గెల్వుఁడీ
మన రాజు క్రీస్తు
దండు నడ్పును
చూడు మాకు ముందు
క్రీస్తు ధ్వజము.
॥ క్రీస్తు వీరులారా
యుద్ధ మాడుఁడీ
క్రీస్తు ధ్వజ మెత్తి
జయ మొందుఁడీ ॥

2. లోక రాజ్య కీర్తి
వాడిపోవును
క్రీస్తు రాజ్యమైన
నిత్య ముందును
సాతా నాధిపత్య
మాఁగిపోవును
క్రీస్తు దివ్య సభ
జయ మొందును.

3. ఓ జనంబులారా
వచ్చి చేరుఁడీ
జయ కీర్తనంబు
లెత్తి పాడుఁడీ
కీర్తి, స్తుతి, ఘన
మెన్నఁ డుండును
మన క్రీస్తు రాజు
నిత్య మేలును.

-సబీన్ చారింగ్ - కూల్డ్
అను : జేకబ్ చేంబర్లేన్